# ఆడపడుచు



నేను సరిగ్గా లోపలికి అడుగు పెట్టేసరికి, ఇందిర చెందూను బెల్టుతో ఇష్టం వచ్చినట్లు కొడుతూ ఉండడం చూసి, ఒక్క ఉదుటున వెళ్లితన చేతిలో బెల్టు లాక్కున్నాను.

"నీక్కానీ మతిపోయిందా ఇందూ! ఏమిటా బాదడం గొడ్డునుబాదినట్లు! వాడెంత? వాడి ప్రాణమెంత? రేప్రొద్దున ఏదైనా జరిగితే రామచంద్రా అంటూ ఏడ్చేది నువ్వే!" అన్నాను చెందూ చుట్టూ రక్షణ కవచంగా నాచేతులు వేసి.

"మీరలావెనకేసుకు రాబట్టే వాడలా పేట్రేగిపోతున్నాడు. లక్షసార్లు చెప్పాను వెధవకి. 'ఆడపిల్ల పట్టుమని ఇరవై ఏళ్ళు కూడా పుట్టింటిలో ఉండదు. ఆ తర్వాత దాని బ్రతుకంతా అత్తారింట్లోనే తెల్లవారుతుంది. దానితో ఏ విషయంలోను పోటీ పడవద్దురా' అంటే వినడు కదా! నేను కూరగాయలు తీసుకువచ్చేసరికి ఒకరితో ఒకరు కాట్ల కుక్కల్లా కొట్టు కుంటున్నారు. ఆ పిల్ల అంతకన్నా! 'తమ్ముడితో పోటీ వద్దే ఒక్కగానొక్క తమ్ముడితో ప్రేమగా ఉండాలే' అని ఎన్నిసార్లు చెప్పినా సరే! ఒకళ్ళని చూసి ఒకళ్ళు నిప్పులు పోసుకుంటున్నారు. నా కడుపున చెడబుట్టారు వెధవలు." ఆయాసంతో రొప్పుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది - విసురుగా.

వెక్కుతున్న వాడి కన్నీళ్ళు తుడిచి నావైపు త్రిప్పుకున్నాను. అసలే పచ్చదబ్బ పండు రంగులో ఉంటాడేమో మోకాళ్ళ క్రింద మోచేతుల మీద బెల్టు వాతలు తేనె రంగులో డ్రాయింగ్ ఆర్టిస్ట్ గీసిన మరకల్లా కన్పిస్తున్నాయి. చొక్కా విప్పి చూశాను.

వీపు నిండా అవే! నాకు కళ్ళు చెమర్చాయి. ఇందిర ఎప్పుడూ ఇంతే. కోపం వస్తే అసలు ముందు వెనుకలు చూసుకోదు. పిల్లలను కొట్టి క్రమశిక్షణ నేర్పడం అనేది నా పద్ధతికి విరుద్ధం. మంచిమాటలతో సందర్భోచితమైన కథలతో వాళ్ళలో మార్పు తీసుకురావాలన్నదే నా సిద్ధాంతం.

"చూడండి! నాకు అంత ఓర్పు సహనం లేవు. దండం దశగుణం భవేత్ అన్నదే నేను నేర్చుకున్న సూత్రం. ఎలాంటి వాడినైనా సరే దెబ్బకు దెయ్యం వదులు తుందంటారు. మీ పద్ధతి నాకు రాదు. నా విధానం మీకు నచ్చదు. నాకు నీతిబోధలు మానేసి మీ పిల్లలకు చేసుకోండి" అని విసుక్కుంటూ ఉంటుంది నామీద కూడా!

నేను ఈ ఆలోచనలో ఉండగానే వాడి ఎక్కిళ్ళు తగ్గాయి. గానీ తెల్లపూవుల్లాంటి వాడి కళ్ళలోంచి నీళ్ళు ఆగకుండా స్రవిస్తూనే ఉన్నాయి.

"ఏం జరిగింది నాన్నా?" అన్నాను వాడిని పక్కన కూర్చోబెట్టుకుని.

వాడు వెక్కుతూ ఇలా చెప్పాడు.

"స్కూలు నుంచి ఇంటికి వచ్చాక 'ఎవరు ఈ సాయంత్రం నీళ్ళు పట్టాలో వాళ్ళు, యూనిఫాం మార్చుకుని రెడీ అవ్వండి! నేను కూరలు తీసుకుని పదినిమిషాల్లో వచ్చేస్తాను' అని అమ్మ బజారుకు వెళ్ళింది. నిన్న హోంవర్క్ విపరీతంగా ఇవ్వడంతో రాత్రి అవి చేసుకునేసరికి చాలా లేటై ఉదయమే లేవలేకపోయాను. ఉదయం నీళ్ళు నేను పట్టాలి. అమ్మే పట్టిందట. సాయంత్రం వంతు అక్కది. అయినా 'నువ్వే పట్టాలి' అంటూ గొడవపెట్టింది. 'నేను పట్టను రేపు ప్రొద్దుట పడతాను' అన్నాను. 'ఏందిలా పడుకుని లేవకుండా ఉండడానికా' అంది. నన్ను తిడితే నాకు కోపం రాదా మరి. అందుకని అక్క వీపు మీద గుద్దుతుండగా అమ్మ వచ్చేసింది. బెల్టుతోటి నన్ను కొట్టేసింది నాన్నగారూ!" అంటూ వాడు నన్ను కరుచుకుపోయాడు.

వాడి వీపు మీద ఆప్యాయంగా నిమురుతూ ఉండిపోయాను రెండు నిమిషాలు.

"ఏమిటీ! వాడిని ఓదారుస్తూ కూర్చున్నారా! మీరొకరు నా ప్రాణానికి! వాళ్ళకి కాస్త క్రమశిక్షణ నేర్పండి అంటే పురాణకథలు చెప్తారు. యిదుగో కాఫీ." టీపాయ్ మీద పెట్టేసి మళ్ళీ వంటింట్లోకి వెళ్ళిపోయింది ఇందిర.

నేను నవ్వుకుంటూనే కాఫీ తీసుకున్నాను.

"నువ్వెళ్ళి డ్రస్ మార్చుకుని, టవల్ కట్టుకుని చల్లని నీళ్ళతో స్నానం చేసిరా. వాటర్‌లో కొంచెం డెట్టాల్ వేసుకో. ఇంతకీ అక్కేదీ!" అడిగాను నేను చుట్టూ పరికిస్తూ.

"తన గదిలో చదువుకుంటోంది. పెద్ద నంగనాచిలా.!" అక్కసుగా అన్నాడు వాడు డ్రస్ ఛేంజ్ చేసుకోవడానికి తన గదిలోకి వెళ్ళబోతూ.

"తప్పు. అలా మాట్లాడకూడదనేగా - అమ్మ కొట్టింది. నువ్వెళ్ళి స్నానం చేసిరా. నైసిల్ వ్రాస్తాను. ఈలోగా అక్కని చూసి వస్తాను!" అని వాడిని బాత్‌రూమ్‌కి పంపి నేను దీప్తి గదిలోకి వచ్చాను.

నన్ను చూస్తూనే దీప్తి లేచి నిలబడింది.

"అయామ్ సారీ నాన్నగారండీ! నావల్లే తమ్ముడు దెబ్బలు తిన్నాడు పాపం. నన్ను క్షమించండి. తమ్ముడికి సారీ చెబుతానుగా!" అంది.

"చూడమ్మా! ఇంటికి పెద్ద పిల్లవు. ఆడపిల్ల నోరు జారితే వెనక్కు తీసుకోవడం చాలా కష్టం. తమ్ముడు ఒంటిమీద వాతలు ఎలా తేలిపోయాయో చూడు. వెళ్ళి వాడికి సారీ చెప్పి నైసిల్ రాసిరా! మళ్ళీ ఏం గొడవ పెట్టకు!" దానికి నైసిల్ ఇచ్చి పంపి, నేను డ్రస్ మార్చుకుంటూనే హాల్లో వారిద్దరినీ గమనిస్తూనే ఉన్నాను.

వారి ప్రవర్తనకు బాధపడుతూ ఏం చేస్తే వారిలో పరివర్తన వస్తుందా అని ఆలోచిస్తున్న నాకు నాన్నగారి దగ్గర నుంచి

వచ్చిన ఫోన్ మార్గాంతరాన్ని సూచించింది.

★★★

'సుజాత అత్తయ్య' - నాన్నగారి చెల్లెలు. అత్తయ్యకి ఒంట్లో బాగుండలేదు. 'ఓసారి వస్తే వెళ్ళిచూసి సాయంత్రానికి వచ్చేద్దాం.' అని నాన్నగారి ఫోన్.

ఇందిరకి నేను పిల్లల్ని తీసుకువెళ్ళడం ఇష్టం లేదు. మావైపు వాళ్ళు ఇందిరకి నచ్చక తను నాతో ఎక్కడకీ రాదు. అందుకే పిల్లల్ని నేను బయల్దేరదీస్తుంటే అడ్డం పెట్టింది.

"ఇందూ! పెద్దయ్యాక వాళ్ళు మనతో రమ్మన్నా రారు. అయినా పిల్లలను నాలుగు చోట్ల తిప్పటం వల్ల చూసిన తాలూకు అనుభవం వారికి భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. సాయంత్రానికి వచ్చేస్తాంగా. నా తరపు చుట్టాలు కూడా ఉన్నారని వాళ్ళకి తెలియచెప్పడం నా కనీసబాధ్యత!"

ఇందిర ఇక నాతో వాదించలేదు.

"సాయంత్రానికి ఖచ్చితంగా వచ్చెయాలి!"

లేకపోతే మనిద్దరి మధ్యా గొడవే! అన్న రీతిలో స్థిరంగా అంది.

నాన్నగారితో, నేను, చెందూ, దీప్తి బయల్దేరి "ముప్పారం" చేరుకున్నాం.

★★★

అత్తయ్యని చూస్తూనే మతిపోయినంత పనయింది, నాకు. నాకుజ్ఞానం వచ్చాక ఆమెని అలా చూడలేదు. 'కంచుకోట' సినిమాలో సావిత్రిలా ఉండే ఆమె 'జగన్మోహిని' సినిమాలో సావిత్రిలా చూసేసరికి కడుపు తరుక్కుపోయింది నాకు.

మంచంమీద నుదుట చల్లని తడి గుడ్డతో నిస్సత్తువగా నీరసంగా కుక్కి మంచంలో పడున్న ఆమె తన శక్తినంతటినీ ఉపయోగించి ఉత్తేజితమైన కళ్ళతో నన్ను చూసి "వచ్చావురా అన్నయ్యా!" అంది.

నాన్నగారనుకుంది కాబోలు.

నేను నాన్నగార్కి ఆ ప్లేస్ ఖాళీ చేసి ఇచ్చాను.

నాన్నగారు వచ్చి అత్తయ్య పక్కన కూర్చున్నారు.

నేను పిల్లలూ పక్కనే నిలబడ్డాము.

"అదేమిటి చెల్లాయ్ ? ఇలా అయిపోయావ్!"

నాన్నగారి గొంతు గాద్గదికంగా అయ్యింది. మాటల్లో ఆర్తి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అన్నగారి చేతిని తన రెండు చేతుల లోకి తీసుకుని బలంగా ఆప్యాయంగా పట్టుకున్న అత్తయ్య మౌనంగా రోదిస్తున్నట్టు ఎగెసిపడుతున్న ఆమె ఎండిన డొక్కలే చెబుతున్నాయి.

"జ్వరం బాగా ఉందిరా అబ్బాయి. ఓసారలా ఊళ్ళోకి వెళ్ళి మన ఆర్.ఎం.పి. గోపాలం ఉన్నాడేమో చూసి వెంటబెట్టుకురా!" అన్నారు నాన్నగారు నాతో.

కదలబోయిన నారెండుచేతులూ పట్టుకున్నారు దీప్తి, చెందూ.

"నాన్న ఇప్పుడే వచ్చేస్తాడమ్మా. నేనున్నాగా! "అన్నారు చెందూను దగ్గరకు తీసుకుంటూ....

అంతలో తేరుకున్న అత్తయ్య అంది హీనస్వరంతో.

"ఉదయం ఆరింటికే గోపాలం వచ్చి ఇంజక్షన్ చేసి మందులు ఇచ్చి వెళ్ళాడన్నయ్యా. వెంకటేష్ కూడా వచ్చాడా!" అంది నన్ను ఉద్దేశించి.

"అవునమ్మా! పిల్లల్నిద్దర్నీ కూడా తీసుకువచ్చాడు!" అంటూ నాన్నగారు దీప్తిని, చెందూని ఆమె ముందుకు జరిపారు.

"నమస్తే నాన్నత్తయ్యా!" అన్నారు పిల్లలిద్దరూ ముక్తకంఠంతో.

"బాగా చదువుకుంటున్నారా నాన్నా. ఈ నాన్నత్తయ్యని చూడడానికి మీరు కూడా వచ్చారా. నా బాబే! నా అమ్మే!" అంటూ ఆప్యాయంగా వారిద్దరి బుగ్గలు పుణికి ముద్దాడిందామె.

ముడతలు పడ్డ ఆమె దేహం, జీవితంలో ఎన్నో కష్టాలు, అనుభవాలు, మలుపులు చవిచూసినట్టుగా ఉంది. ఆమె చేతి ఎముకలు గుచ్చుకున్నాయేమో పిల్లలిద్దరూ నెమ్మదిగా లేచి వచ్చి, నా వెనుక చేరిపోయారు.

"రమణ లేడా?" నాన్నగారి మాట పూర్తయ్యేలోగా....

"ఏరా బావా! ఎప్పుడొచ్చారు? ఓ! పిల్లలిద్దరూ వచ్చారే!" అంటూ ఫ్రీగా మాట్లాడబోయిన వాడు నాన్నగార్ని చూస్తూనే పులిని చూసిన లేడికూనలా అయిపోయాడు.

"ఎంతసేపయ్యింది మావయ్యా వచ్చి?" అన్నాడు చేతులు కట్టుకుని నిలబడి.

"ఇప్పుడేరా! నీ ఆవిడేది? కనబడదేం?" నాన్నగారి కంఠం గంభీరంగా మారిపోయింది. చూపుల్లో క్రోధపు ఛాయలు ప్రస్ఫుటంగా గోచరించాయి.

రమణ మాట్లాడలేదు.

"అమ్మా! సుజాతా! మందులు వేసుకున్నావా లేదా?"

ఆమె లేదన్నట్టుగా తలవూపింది.

"బాబూ వెంకూ! నువ్వెళ్ళి పిల్లలకు టిఫిన్ పెట్టించి, నాలుగు ఇడ్లీ చెట్నీ లేకుండా పంచదారవేయించి తీసుకురా!" అన్నారు నాతో.

"నీ కోడలు టిఫిన్ పెట్టలేదామ్మా?" రమణ అమాయకంగా అడిగాడు.

నాన్నగారు వాడికేసి చూసిన చూపు వాడిని రెండవమాట మాట్లాడకుండా చేసింది.

"నువ్వెళ్ళు బాబూ!" అన్నారు నాన్నగారు. నేను పిల్లలతో సందుచివర 'సీను' హోటల్‌కు వచ్చేశాను.

★★★

పిల్లలకు టిఫిన్ పెట్టించి వేడిగా తీసిన ఇడ్లీలను పేక్ చేయించుకుని ఇంట్లో అడుగుపెట్టేసరికి మా రమణమూర్తి భార్య 'విద్యావతి' ముక్కు చీదుతూ అంటోంది.

"మీకేం తెలుసు పెదనాన్నగారూ? ఆవిడ మమ్మల్ని రచ్చకీడ్చాలని చూస్తోంది. మా మీద పంతం నెగ్గించుకోవడానికి కాకపోతే, వారంరోజులుగా తిండి మానేసి, లేని జ్వరం తెచ్చుకుని, మమ్మల్ని, ఎక్కడో ఉన్న మీకు రహస్యంగా ఉత్తరం వ్రాసి ఇంతగా ఇబ్బంది పెడుతోందంటే మీకేం తెలుసు మా బాధ? ఆవిడ తనగోడు

వెళ్ళబుచ్చుకోవడానికి పెద్దవారు మీరున్నారు. మాకెవరున్నారు?''

అసలే ఎర్రగా ఉంటుందేమో. ముక్కు చీదుతూ కళ్ళమ్మట నీళ్ళు తుడుచుకునే సరికి బుగ్గలు ఎర్రగా చిదిమితే రక్తం చిందేంతగా ఎరుపెక్కి ముక్కుపుటాలు విశాలమవుతున్నాయి.

నాన్నగారు సమాధానం చెప్పబోయినవారల్లా నన్ను చూసస్తూనే నాచేతిలో పొట్లాం తీసుకున్నారు.

అత్తయ్యఇప్పుడు మంచంలో పడుకుని లేదు. కుర్చీలో కూర్చుని ఉంది. ముఖం కడిగి, శుభ్రమైన కల్నేత చీర కట్టడంతో తేటగా ఉన్నా, జ్వరతీవ్రత ఉన్నట్టు ఆమె వేడి నిట్టూర్పులు విడుస్తోంటే తెలుస్తోంది.

నాన్నగారు పొట్లాం విప్పి ఇడ్లీ తినిపించి మందులు వేశారు. ఆబగా తిందామని ప్రయత్నించినా రెండు ఇడ్లీల కన్నా ఎక్కువ తినలేకపోయింది అత్తయ్య.

నాన్నగారు అత్తయ్యని మంచంలో పడుకోబెట్టారు.

''అమ్మా సుజాత! మేం అలా వెళ్ళొస్తాం. మన కరణంగారు దారిలో కనిపించి 'ఓసారి ఇంటికి వచ్చివెళ్ళరా అబ్బాయి' అన్నాడు. ఓసారి కనిపించి వస్తాం'' అన్నారు.

అత్తయ్య నీరసంగా తలవూపింది. నిమిషాల్లో నిద్రలోకి జారుకుంది.

"రమణా! ఓ గంటలో వస్తాం నీతో మాట్లాడాలి. రా వెంకూ. పిల్లలేరీ?'' అడిగారు నాన్నగారు బయటకు వెళ్ళడానికి ఉద్యుక్తులవుతూ.

"మా పిల్లల్తో వీధిలో ఆడుకుంటు న్నారు మావయ్యా!" అన్నాడు రమణమూర్తి.

నేను గమనించనే లేదు.

దీప్తి, చందూలకు ఆ మంచి లక్షణం ఉంది. నాలా రిజర్వ్డ్ మనస్తత్వం కాదు.

మేం వీధిలోకి వచ్చి పిల్లల్ని తీసుకుని బయల్దేరాం.

★★★

"ముప్పారం" మా తాతగారి ఊరు నాన్నగారు పుట్టిన ఊరు. నాన్నగారు తన చిన్ననాటి అల్లరి చేష్టలు, అమ్మని ఎలా ప్రేమించి పెళ్ళి చేసుకున్నదీ, ఇద్దరూ ఏపి పుట్టలు, చెట్లమ్మట తిరిగిందీ అన్నీ కథలుగా వివరిస్తూ ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూపించారు. దారిలో తెలిసున్న వారందరినీ పలకరించారు.

చివరిగా సోమేశ్వరస్వామి దేవాలయానికి వచ్చాం.

నాన్నగారు అక్కడ అష్టోత్తర పూజ చేయించారు. అ[illegible]ేర, తనపేరున, నా పేరున విడివిడిగా.

ఆచారిగారు ఆప్యాయంగా పలకరించారు, 'రామాయమ్మ' మెస్‌లో భోం చేసాము. తిరిగిదారిలో పళ్ళు కొనుక్కుని అత్తయ్యగారింటికి చేరాం.

★★★

"కాళ్ళు కడుక్కుని రండి పెద్దనాన్న గారు. భోజనం వడ్డిస్తాను.'' మేం లోపలికి అడుగుపెట్టేసరికి విద్య రెడీగా భుజాన వేసుకున్న టవల్ తీసి అందివ్వబోయింది.

"మా భోజనం అయిపోయిందమ్మా. పిల్లలూ. మీరెళ్ళి ఆడుకోండి నాన్నా!" అంటూ వాళ్ళని రమణ పిల్లల దగ్గరకు పంపేశారు నాన్నగారు.

'ఏం! మా ఇంట్లో భోజనం చెయ్యకూడదనుకున్నారా మావయ్యా!" రమణ అడిగాడు నాన్నగార్ని సూటిగా చూస్తూ కుర్చీలోంచి లేచి సీటు చూపిస్తూ.

"అవున్రా! నా అభిప్రాయం సరిగ్గా గ్రహించావు. మేం ఎవరింటికీ వెళ్ళలేదు. రామాయమ్మ మెస్‌లో భోంచేసి వస్తున్నాం.

నీ కన్నతల్లి అయిన నా చెల్లికే నీ ఇంట్లో భోజనం చేసే యోగ్యత లేకపోతే పరాయివాళ్ళం, మాకు ఉంటుందని ఎలా అనుకుంటామురా? !"

నాన్నగారు మడతకుర్చీ గుడ్డ దులిపి కూర్చున్నారు.

"ఎంత మాట మావయ్యా? మీ ఇంట్లో ఉండి పి.యు.సి. చదివాను. అత్తయ్య నన్ను చూసి కాదు, నా పొట్ట తడిమి మరీ అన్నం పెట్టేది. ఈనాడు ఈ ప్రైవేట్ జాబ్ చేస్తున్నానూ అంటే మీ చలువ కాదూ! కానీ... కానీ అమ్మ నంగతి మీకు తెలీదు మావయ్యా! మీ తాతల ఆస్తి మీకు రాకుండా చేయడంలో, చినమామయ్యతో చేతులు కలిపి ప్రతి సంవత్సరమూ 'ఆడపడుచు' లాంఛనంగా మీరిచ్చే బట్టలు కట్టుకుని, మీరిచ్చే సొమ్ము తీసుకుని మిమ్మల్ని కూడా మోసం చేసింది".

"అవన్నీ నాకు తెలుసు! దానివల్ల నీకు కలిగిన నష్టం ఏమిటి?"

ఊహించని ప్రశ్న ఎదురయ్యేసరికి మతిపోయినవాడిలా రమణమూర్తి తడబడిపోయాడు.

"మా ఆవిడని అనరాని మాటలంది!"

"ఏమని?...."

"ఏమని అంటే...."

"నువ్వాగు. నువ్వు చెప్పమ్మా విద్యా. మీ అత్తగారు నిన్ను ఏమంది? కట్నం తెమ్మని వేధించిందా? మడిదడి అంటూ సాధించిందా? మీ ఇద్దరి అనురాగానికి మధ్యలో అడ్డుగా తయారైందా? ఏం చేసిందో చెప్పమ్మా!" గద్దించి అడిగారాయన.

"అదికాదు పెద్దనాన్నగారు. మావాళ్ళు వస్తేనే ఆవిడకు గిట్టదు. మా పుట్టింటికి ఆయన సంపాదనంతా ధారపోస్తున్నానట. నాకు సినిమాల పిచ్చట. షోకులు చేసుకుతిరుగుతానట. కనిపించిన చీరల్లా కొంటానట!."

"ఆవిడ నిజంగా అలా అందా. నువ్వు ఊహించుకున్నావా."

"........."

"నిజం చెప్పమ్మా. నిజంగా నా చెల్లెలిదే తప్పైతే ఈ వయసులో కూడా నీ ముందే ఆమెను చెంప ఛెళ్ళుమనిపిస్తాను. నిజం చెప్పు!" తీవ్రస్వరంతో నాన్నగారడిగిన మాటలకు ఆ గది ప్రతిధ్వనించింది.

"ఆవిడే అంది!" తడబడుతూ అంది విద్య. " ఆవిడ ఆమాట లేవీ అనలేదు అని చెప్పేందుకు నాదగ్గర సాక్ష్యం ఉంది. అందుకు నువ్వేమన్నావ్!"

"ఎప్పుడూ?''

"పదిరోజుల క్రితం మీ అమ్మగారు వచ్చినప్పుడు''

"నేనేమీ అనలేదే!''

"నామీద గౌరవం ఉంటే, రమణా, మీ ఆవిడ చేత నిజం చెప్పించరా!'' గర్జించారు నాన్నగారు.

"నిన్ను తగలెయ్య. ఏమన్నావో చెప్పవే. నీ మాటలన్నిటికీ తలూపి, నువ్వు ప్రతీదానికి ఛస్తానని బెదిరించడంతో ఇంత గొడవొచ్చి పడింది. చెప్పు! నిజం చెప్పు!'' ఆవేశంగా ఒక్క అరుపు అరిచి రమణ ముందు కురికాడు.

"అమ్మ ముందు నామీద పెత్తనం చెలాయించబోయిందావిడ. అందుకని... అందుకని మీరు ఛస్తేగాని నాకాపురం చక్కబడదు అన్నాను'' - అనేసి బావురుమంది విద్యావతి.

కొయ్యబారిపోయాడు రమణమూర్తి.

నాన్నగారు లేచి తనజేబులో ఉత్తరం తీసి రమణకిచ్చారు.

రమణ చదివి నాకిచ్చాడు.

అందులో ఇలా ఉంది.

"పూజ్యులు గౌరవనీయులు అయిన శ్రీ చక్రధరరావు బావగార్కి,

నమస్కారాలతో అన్నపూర్ణ వ్రాయునది.

నేను మీ మేనల్లుడి అత్తగార్ని. విద్యావతి మా అమ్మాయి. వంశగౌరవంలో మా స్థాయి కన్న పెద్దదైన, అన్నివిధాల అనువైన సంబంధం అని మీ మేనల్లుడికి మా అమ్మాయిని ఇచ్చి చేశాం. నాకు మా అమ్మాయి ఒక్కతే. నా ముగ్గురు కొడుకులు, కోడళ్ళు నన్ను ప్రాణప్రదంగా చూసుకుంటారు. అప్పుడప్పుడు అమ్మాయిని చూడ్డానికి నేను మూడ్వారం వెళ్తుంటాను. కానీ వెళ్ళిన ప్రతీసారి నేను చాలా ఆశ్చర్యపోయే విషయం మా అమ్మాయి మీ చెల్లెల్ని 'అత్తింటికం' పెట్టడం. ఆవిడ నిజంగా ఎంతో ఓర్పుగల మనిషి. చిన్నప్పటి నుంచి మా అమ్మాయికి 'ఎదురెట్టి చదరంగం' ఆడడం, అంటే తనమీదకేదైనా వచ్చిపడిపోతుందేమో అనే భయంతో ప్రవర్తించడం, నోరేసుకు పడిపోవడం అలవాటు. మా ఇంటికి వచ్చినప్పుడల్లా ఎందుకొస్తుందో తెలీదు. అంతలోనే 'వాళ్ళేదో అన్నారు వీళ్ళేదో అన్నారు' అని ఒకటికి పది కల్పించుకుని ఊహించుకుని అరగంటలో బయల్దేరి పోతుంది. రానురాను దాన్ని కంట్రోలు చేయడం మా ఎవ్వరివల్లా కావడంలేదు. పదిరోజుల క్రితం నేను వాళ్ళింటికి వెళ్ళిన్న [illegible] ''ఏబారా'' ఖర్చులు తగ్గించుకోమ్మా! నీ సంసారం తీర్చి దిద్దుకోవాల్సింది నువ్వే!'' అని మీ చెల్లాయి అన్నప్పుడు "మీరు ఛస్తే నా కాపురం బాగుపడుతుంది!'' అనేసరికి మీ చెల్లాయి చాలా బాధపడ్డారు. తల్లిగా లాగిలెంపకాయ కొట్టాను. "మళ్ళీ నా గుమ్మం ఎక్కద్దు. ఇది నా సంసారం. నా ఇష్టం.'' అంది. దీనికంతటికీ కారణం మీ మేనల్లుడి అతిమంచితనం! వారి కాపురంలో ఎటువంటి కలతలు లేకుండా చూసే పూచీ మీది! ఆ తరువాత

నేను రెండు రోజులు ఉన్నాను. అభిమాన వంతురాలైన మీ చెల్లెలు పచ్చిమంచినీళ్ళు ముట్టలేదు. ఒకసారి మీరు చూసి, వీలైతే నా వంతు కూడా నాలుగు తగిలించి, పెద్దవాళ్ళంటే కనీసం భయం, భక్తి నేర్పి పుణ్యం కట్టుకోమని ప్రార్థిస్తున్నాను.

నమస్కారాలతో - అన్నపూర్ణ."

దానిని మౌనంగా విద్యకి అందించాను. చదువుతున్న కొద్దీ వూసరవెల్లి రంగులన్నీ ఆమె వదనంలో కనిపించాయి.

రమణ కోపంగా భార్యమీద చెయ్యెత్తాడు.

నాన్నగారు ఒక్క ఉదుటున లేచి ఆపారు. "రమణా! ఆవేశాలకు సమస్యలు పరిష్కారం కావురా. ఇందులో నీ తప్పు కూడా ఉంది. తల్లా పెళ్ళామా? అన్నది కాదురా ప్రశ్న! తల్లేరా. మొదట స్థానం ఎపుడూ జన్మనిచ్చిన తల్లికేరా! నువ్వుంటేనే నీవెనుక ఒక పెళ్ళాం తయారయ్యేది. తల్లి తర్వాతే పెళ్ళాం. పెళ్ళాం చెబితే వినాలి. కరక్టే. కానీ ఆలోచించుకోవాలి. నీ తల్లి ఏమిటో, నీకు తెలిసిన తరువాతే పరాయి ఇంటి నుంచి వచ్చిన పిల్లకు తెలిసేది. నాచెల్లెలు అభిమానవంతురాలు. 'నా తమ్ముడితో కలిసి నాకు ద్రోహం చేసిందన్నావే!' ఎవరికోసం? నీ కోసం నీ బిడ్డల కోసం కాదూ. నా కొడుకుకు అది తినే యోగం లేదు. నీకు ఉంది అంతేరా. పెద్దవాళ్ళు ఏం చెప్పినా మనమంచికే అని ఈ కాలం పిల్లలు వయసుడిగాక గానీ తెలుసుకోలేక పోతున్నారు. అది మీ ప్రారబ్ధం. మా ఖర్మ. మా మాట వినకపోతే సరే. కనీసం మమ్మల్ని గౌరవించనైనా గౌరవించాలి కదా. ఎటువంటి వ్యక్తికైనా ఓ ఆత్మగౌరవం అంటూ ఉంటుంది కదా. కనీసం వయసుకి ఇచ్చే గౌరవం కూడా ఇవ్వకుండా మీ ఆవిడ నేను వచ్చినప్పటి నుంచి నా చెల్లెల్ని 'అది' అన్న భావంతోనే మాట్లాడింది. ఇప్పుడు అర్థమైందా నేను నీ ఇంట్లో ఎందుకు భోజనం చెయ్యలేదో!"

నాన్నగారి మాటలు పూర్తి కాకుండానే విద్య నాన్నగారి కాళ్ళమీద పడింది. "నన్ను.... నన్ను క్షమించండి పెదనాన్నగారూ! నేను ఘోరమైన తప్పు చేశాను" ఆమె అగ్ని పర్వతం బద్దలైనట్లు వెక్కివెక్కి రోదించ సాగింది.

"చూడమ్మా! 'ఆడపడుచు' కంట తడిపెడితే ఏడు తరాలకు క్షోభ కలుగుతుందంటారు. మా ఇంటి ఆడపడుచు అయిన మీ అత్తగార్కి ప్రతీ సంవత్సరం దీపావళి వెళ్ళిన తదియనాడు, భగినీ హస్త భోజనం పేరట ఆమె చేతి వంట తిని, ఆమెకు పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవికెలగుడ్డ, పువ్వులు, పళ్ళు ఇవ్వడం అనేది మా అమ్మగారు మాకు ఎప్పుడు అలవాటు చేశారో తెలీదు. ఆనాటి నుంచీ క్రమం తప్పకుండా పాటిస్తూ వస్తున్నాను. ఈసారి నా చెల్లెలి చేతి భోజనం తినకుండా చేశావుకదమ్మా! నువు పడాల్సింది నా కాళ్ళమీద కాదు! మీ అత్తగార్ని క్షమాపణ అడుగు!" అన్నారు నాన్నగారు విరక్తిగా.

విద్యలేచి కళ్ళు తుడుచుకుంది. అణువణువునా ఆమె పశ్చాత్తాపపడు తోందన్న విషయం ఇంకా ఎక్కుతూ ఉన్న ఆమె ఎక్కిళ్ళే చెబుతున్నాయి.

"ఆగమ్మా! ఇవి తీసుకుని మీ అత్తగార్కి ఇవ్వు!" అంటూ నాన్నగారు నా చేతిలోని పళ్ళు సంచిలోని చీర, రవికల గుడ్డ విద్యకిచ్చారు.

జ్వర తీవ్రత తగ్గి అప్పుడే మెలకువ వచ్చిన అత్తయ్యను నాన్నగారు లేపి కూర్చో పెట్టారు. వాటన్నింటిని అత్తగారి చేతులకిచ్చి అత్తగారి కాళ్ళమీద పడింది విద్య.

"నన్ను క్షమించండి అత్తయ్యా. మీరేం చెప్పినా నా శ్రేయస్సు కోరి చెప్పారని గ్రహించలేకపోయాను. మా అమ్మమీద ఒట్టేసి చెబుతున్నాను. ఇంకేనాడు మీ మీద ఈగ వాలనివ్వను. నా ప్రాణంలో ప్రాణంగా మిమ్మల్ని చూసుకుంటాను. నన్ను క్షమించండి!"

"అవునమ్మా! ఇందులో నా తప్పు కూడా ఉంది. నన్ను కూడా క్షమించు. "
రమణ కూడా అత్తయ్యకు నమస్కరించాడు.

"నాకిప్పుడు సంతృప్తిగా ఉందిరా అబ్బాయి. కష్టం కలిగించే మాటలు ముందు ఈటెల్లా గాయాలు చేసినా ఫలితం ఎప్పుడూ చల్లని మంచుగడ్డలో కడిగినట్టుగా ఉంటుంది. ఎప్పుడూ నా చెల్లెలు కంట తడిపెట్టకుండా ఇలా నవ్వుతూ ఆరోగ్యంగా ఉండాలన్నదే నా కోరిక!"

నాన్నగారు అత్తయ్య పక్కన కూర్చుని ఆప్యాయంగా తలనిమిరారు.

అరుపులకు, కేకలకు ఎప్పుడు లోపలి కొచ్చారో, పిల్లలు నలుగురూ గోడనానుకుని చేతులు కట్టుకుని వింతగా చూస్తున్నారు.

నేను దీప్తిని, చెందూని దగ్గరగా పిలిచాను.

"నిజమైన అన్నాచెల్లెళ్ళంటే వాళ్ళు. చూశారా! తాతగారు, నాన్నత్తయ్య ఎంత హేపీగా ఉన్నారో!" అన్నాను నేను.

"మేం కూడా ఇంకెప్పుడూ అలాగే ఉంటాం నాన్నగారు"

"ప్రామిస్"అంతలోనే "ప్రామిస్" నా చేతిలో చేతులు వేశారువారిద్దరు.

అంతలో విద్య లేచి బత్తాయిపళ్ళు జ్యూస్ చేసి తెచ్చింది.

"ఇలా ఇవ్వమ్మా" అన్నారు నాన్నగారు.

"కాదు పెద్దనాన్నగారు. నేనే అత్తయ్య గారి చేత నిరాహారదీక్ష విరమింపచేస్తాను. ఈ సమస్యకు మూలకారణం నేనే కదా!" అంది బాధగా.

"కాదమ్మా! ఇదొక మంచుకల! ఎవరిపాత్ర వాళ్ళు పోషించడమే మన పని! అన్నీ ఆ పైవాడే చేసుకుపోతాడు. సరే. నీ చేత్తోనే త్రాగించు!" అన్నారు నాన్నగారు.

అపురూపమైన గాజు బొమ్మను పొదివి పట్టుకున్నట్టుగా అత్తయ్యను పట్టుకుని జ్యూస్ త్రాగించసాగింది విద్య.

జీవం తొణికిసలాడుచున్న చూపుల్తో ఆరాధనగా నాన్నగార్ని చూస్తూ ఉండి పోయింది అత్తయ్య. ●

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
04-05-2002